నూతన కార్యదర్శి ఎదుట సవాళ్లు..

ఖమ్మం మార్కెట్‌లో జోరందుకున్న మిర్చి కొనుగోళ్లు

- ధరలో హెచ్చుతగ్గులపై ప్రభుత్వం దృష్టి
- మరోపక్క ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ధర స్థిరీకరిస్తూనే.. మార్కెట్ నిర్వహణపై దృష్టి సారిస్తేనే ఫలితం



రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా ఖమ్మం పేరుగాంచింది. ఈ మార్కెట్‌కు ఖమ్మం జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి రైతులు తాము పండించిన ఆహార, వాణిజ్య పంటలను తీసుకొచ్చి మరీ విక్రయిస్తుండడంతో సీజన్‌లో నిత్యం రూ. కోట్ల విలువ గల పంట క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఈనేపథ్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నూతనంగా నియమించబడిన ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఎదుట సవాళ్లు ఉన్నాయనే చెప్పొచ్చు. ఇక్కడ గత నెల క్రితం పూర్తి అదనపు చార్జితో పనిచేసిన రుద్రాక్షి మల్లేశంను హుజూర్‌నగర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను నియమితులయ్యారు. కాగా, ఈ నెల వ్యవధిలో మిర్చి విక్రయాలు పుంజుకోవడం, ధరలో వ్యత్యాసాలు చోటు చేసుకుంటుండగా.. మిర్చి ధరలో వ్యత్యాసాలను సరిచేసి, మార్కెట్ నిర్వహణను గాడిలో పెట్టాల్సిన బాధ్యత నూతన కార్యదర్శిపై ఉంది.

సీజన్ ఆరంభం నుంచే ధరలో వ్యత్యాసాలు..

ఈ మార్కెట్‌లో ప్రస్తుత సీజన్‌లో పండించిన మిర్చి విక్రయాలు డిసెంబర్ నుంచి ప్రారంభమైనప్పటికీ జనవరి ఆరంభం నుంచి పుంజుకున్నాయి. దీంతో దిగుబడి పెరగగా.. జెండాపాట ద్వారా విక్రయాలు చేపట్టారు. దీంతో మునుపటి ధరకు జెండాపాట ద్వారా ధరకు పొంతన లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్ వద్ద రైతులు ఆందోళన కూడా చేశారు. ఈ క్రమంలో ధర వ్యత్యాసాల వ్యవహారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి చేరడంతో సమగ్ర చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ, ఉద్యాన శాఖలను ఆదేశించారు.

అధికారుల నిరంతర పర్యవేక్షణ..

మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఆ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల బృందం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. ఇదే సమయాన మంత్రి తుమ్మల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి మిర్చి ధరలో వ్యత్యాసాలు చోటు చేసుకోకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేకంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను నియమించగా.. ఆయన ఎప్పటికప్పుడు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ కూడా మార్కెట్‌ను సందర్శించి ధరలు, ఇతర సమస్యను పరిశీలించారు.

అక్రమాలపై ప్రత్యేక కార్యాచరణ..

ఈ నెల 26న మార్కెట్ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పి.ప్రవీణ్‌కుమార్ తొలుత కలెక్టర్, అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలువగా.. వారు మార్కెట్ నిర్వహణ, మిర్చి ధరలపై సమగ్ర చర్యలుండాలని సూచనలు చేశారు. ఆ వెంటనే అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వ్యాపారులు, మార్కెట్ వర్గాలతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. అంతేకాక మార్కెట్ ఉద్యోగులను సమన్వయ చేసుకుంటూ క్రయ, విక్రయాల సమయాన రైతులు, వ్యాపారులతో మాట్లాడడం, కాంటాలు తేడాలు లేకుండా చూడడం, మార్కెట్ గేట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటివి పరిశీలిస్తూ తన కార్యాచరణను అమలు చేస్తున్నారు.

మిర్చి కొనుగోళ్లకు మంచి పేరు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి కొనుగోళ్లలో ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ కొనుగోలు చేసే విదేశీ రకంగా పేరుగాంచిన 'తేజా'మిర్చి ఎక్కువగా చైనా, థాయ్‌లాండ్, సింగపూర్, బంగ్లాదేశ్ వంటి విదేశాలకు ఎగుమతి అవుతుంది. ఈ మిర్చి ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్ పరిశ్రమలు వెలిశాయి. తేజా మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్ ప్రత్యేకం కావడంతో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రైతులు పంటను విక్రయానికి తీసుకొస్తుంటారు.

విదేశీ ఆర్డర్లు పెరిగితే ధర నిలకడగా..

మిర్చి ధర జెండాపాట ధరకు మార్కెట్‌లో కొనుగోళ్లకు రూ. వేలల్లో వ్యత్యాసం ఉంటుంది. అదేమంటే నాణ్యతా ప్రమాణాలను వ్యాపారులు ముందుకు తీసుకొస్తున్నారు. నాణ్యత ఉన్నా ధర దక్కడం లేదని క్వింటాకు రూ. 3వేల నుంచి రూ. 5 వేలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇకపై పంట రెండో కోతల విక్రయాలు పెరగనుండడంతో ధరల్లో వ్యత్యాసాలు తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. దీనికి తోడు విదేశీ ఆర్డర్లు పెరిగితే కూడా ధర నిలకడగా ఉంటూ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం కూడా ఉంది.

వ్యవసాయ మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ మార్కెట్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) జిల్లా నాయకులు ఖమ్మం మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ మార్కెట్‌లో అమ్మే సరుకుపై బైలా ప్రకారం నూటికి రూ.2లు మాత్రమే కమీషన్ తీసుకోవాలని, రైతుకు కాంటా వేసిన వెంటనే డబ్బులు చెల్లించాలని, ఒక్కో ఖాళీ బస్తాకు రూ.60లు ఇవ్వాలని, దడవాయి, దిగుమతి, ఎగుమతి తదితర ఖర్చులు రైతుల నుంచి కాకుండా వ్యాపార వర్గాలే భరించాలని, కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉన్న సరుకుకు వడ్డీలేని రుణాలు మార్కెట్ కమిటీ ఇవ్వాలని కోరారు. మార్కెట్ ప్రాంగణంలో బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాలని, రైతుల అవసరాలకు తగినట్లుగా మౌలిక వసతులు కల్పించాలని, భోజనశాల, ఫలహారశాల ఏర్పాటు చేయాలని, విశ్రాంతిభవనం అందుబాటులో ఉంచాలని, రైతు సరుకుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, కేశోతు లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, వెంకట అప్పారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: 58 జీఓకు సంబంధించి ఇల్లు ఉండి ఇంటి నంబర్ లేని వారికి ఇంటి నంబర్ కల్పించడం, పన్నులు చెల్లించని వారి నుంచి పన్నులు వసూలు చేయడంపై దృష్టి సారించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 58 జీఓ కింద వచ్చిన దరఖాస్తులను విచారణ చేయాలని సూచించారు. ఈ విచారణకు ప్రత్యేక టీమ్‌ల ద్వారా విచారణ చేసి ఇంటి నంబర్లు జారీ చేయాలని సూచించారు. పన్నుల వసూలు కూడా వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సమయాన ప్రధాని నరేంద్రమోదీ జెడ్ కమిటీ వేసి వర్గీకరణ చేస్తానని ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, హరీశ్, దిలీప్, ఎం.వెంకటేశ్వర్లు, కుటుంబరావు, రాంబాబు, లక్ష్మణ్‌బాబు, అరుణ్‌కుమార్ స్వరూపరాణి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంకా వెంకటేశ్వర్లు

పదో తరగతి అంతర్గత మార్కులు పరిశీలన

ఖమ్మంఅర్బన్: పదో తరగతి విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకన అంతర్గత మార్కుల పరిశీలన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈమేరకు మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు ఆధ్వర్యాన మండలంలోని రోటరీనగర్, వెలుగుమట్ల, పుట్టకోట ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి అంతర్గత మార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోటరీనగర్ ప్రధానోపాధ్యాయుడు మోతుకూరి మధు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యాన విద్యార్థులను సమాయత్తం చేసేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. ఉపాధ్యాయులు గౌతమి, పద్మ, సుభాషిణి, నాగేంద్రబాబు, కె.పద్మావతి, నాగమణి పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌ను కలిసిన 'మానుకొండ'

రఘునాథపాలెం: ఏఐసీసీ నాయకురాలు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ గురువారం హైదరాబాద్‌లోని మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌద రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.కార్యక్రమంలో నా యకులు బండి నాగేశ్వరరావు, దుంపటి నగేశ్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, పత్తి శ్రీనివాసరావు, ఎండీ ముస్తాఫా, సురేంద్ర, వెంకటేశ్వర్లు, దొంతినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి



మంత్రికి వినతి ఇస్తున్న వేపకుంట్ల నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామపంచాయతీలో గడిచిన వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తాగు నీటి సమస్య ఏర్పడి ప్రజలు నానా అవస్థలు పడ్డారని కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. ఈమేరకు గురువారం తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపాలని మంత్రికి వినతిపత్రం అందించగా.. స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో నాయకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, బండి నాగేశ్వరరావు, అరికట్ల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం అర్బన్ ఏఈ విద్యుత్ సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీనగర్‌కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రోటరీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, గోపాలపురం ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. దీంతో శ్రీనగర్‌కాలనీ ఏరియాలు, రోటరీనగర్, గోపాలపురం, గొల్ల గూడెం, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

క్లుప్తంగా

'పగడాల' నివాసానికి మాజీ మంత్రి



నాగరాజుతో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెళ్లి కలిశారు. కాగా, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రాగా నాగరాజుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అంతకుముందు మాజీ మంత్రి నాగరాజును జిల్లా జైలుకు వెళ్లి కలిశారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పునుకొల్లు రాంబ్రహ్మం, కార్పొరేటర్లు నాగండ్ల కోటి, కూరాకుల వలరాజు, మాజీ డిప్యూటీ మేయర్ మురళి, నాయకులు వెంకటేశ్వర్లు, తిరుమలరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల సత్తా

ఖమ్మంరూరల్: మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లోని బుదేరా కళాశాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యాన మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినిలు ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీరాణి తెలిపారు. కబడ్డీ, షార్ట్‌పుట్ పోటీల్లో బంగారు పతకాలు పొందడంతో గురువారం వారిని వైస్ ప్రిన్సిపాల్ జె.శ్రీలక్ష్మి, తేజ, కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

డీసీసీబీ చైర్మన్ నివాళి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో శుక్రవారం రాజారాం సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్ దశ, దిన కర్మకు డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం పాటుపడ్డ వ్యక్తి శ్రీనివాస్ అని, ఆయన లేని లోటు సొసైటీలో పూడ్చలేనిది అన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీస్ అందజేత

ఖమ్మంరూరల్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ అనుబంధ ఆశావర్కర్ల యూనియన్ నాయకులు అన్నారు. గురువారం ఈమేరకు స్టాఫ్ నర్స్ గౌతమికి సమ్మె నోటీస్ ఇచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు పనిభారం పెంచారు కానీ కనీస వేతనాలు ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని తెలిపారు. నెల నెలా వేతనాలు కూడా రాక ఆశాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 2018లో కేంద్రం పెంచిన వేతనాలను ఏరియర్స్‌తో కలిపి ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు బేతంపూడి మల్లేశ్వరి, ఉప్పలమ్మ, మంగమ్మ, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
సాయిరాం	నా సామిరంగ
ఆదిత్య	బూట్‌కట్ బాలరాజు
శ్రీనివాస	కిస్మత్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	60	చుక్కకూర	3
బీర	46		20
దొండ	36	తోటకూర	2
పొట్లకాయ	46		10
చిక్కుడు	40	గోంగూర	2
గోరుచిక్కుడు	56		10
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	66		30
క్యారెట్	26	పుదీన	1
క్యాప్సికం	56		20

-ఖమ్మం వ్యవసాయం

బచ్చోడును మండల కేంద్రం చేయాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం ఖమ్మంలోని ప్రజాపంథా కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వినతి పత్రం అందజేశారు. బోదకాలు (ఫైలేరియా) బాధితులను వికలాంగులుగా గుర్తించి నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, సదరం సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. అన్ని డిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులను వయా కాకరవాయి మీదుగా సూర్యాపేట, హైదరాబాద్ వరకు నడిపించాలని, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండల కేంద్రం చేస్తానని చెప్పిన హామీని గుర్తుచేసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు ఆర్.శివలింగం, తిమ్మిడి హన్మంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులిగుజ్జు వెంకటస్వామి, మీగడ సైదులు, మీగడ సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి..

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 11న ఖమ్మంలో జరిగే గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరావు ఆధ్వర్యాన సంఘ 21వ మహాసభ పోస్టర్లను గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, ఉపాధ్యక్షులు సుదర్శన్, కొండలరావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, తిరుపతి, ఎం.వెంకటేశ్వర్లు, ఉపేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాపటపల్లి వాసికి స్టాఫ్ నర్సు ఉద్యోగం



నియామక పత్రం అందుకుంటున్న గౌతమి

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ తగరం బాబు కూతురు గౌతమి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. హరిజన సామాజిక వర్గానికి చెందిన ఆమె ఉద్యోగం సాధించిన ఆమెను గురువారం గ్రామ సర్పంచ్ ముత్తమ్మ, కుటుంబ సభ్యులు అభినందించారు.

విద్యార్థినికి అభినందన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎడ్ల స్రవంతి ఈ నెల 3వ తేదీన మెదక్ జిల్లా తుప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణకుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థినికి రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న హసన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 5వ తేదీన నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం 10వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.హసన్, షేక్.జానిమియా తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్.హసన్, వ్యవస్థాపకుడు ఎస్‌కె.నజీరుద్దీన్, నాయకులు ఖాసీం, ఇమామ్, ఇసాక్, సొందు మియా, ఆశ, చాంద్‌పాష, హుస్సైన్‌మియా, నజీర్, మదార్‌సాహెబ్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం.గిరిలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా ప్రైవేట్ పరం చేశారని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసల్లాగా మార్చిందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకుండా మానవ హక్కుల మీద దాడికి పూనుకుంటుందని, సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలపక్ష పార్టీల నాయకులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, రాయల చంద్రశేఖర్, శింగు నర్సింహారావు, మాదినేని రమేష్, సీ.వై. పుల్లయ్య, ఆవుల అశోక్, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, పోటు కళావతి, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి గోశాలకు వరిగడ్డి వితరణ



వరిగడ్డిని వితరణ చేస్తున్న గో సేవకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని హర్కారా బావి సెంటర్ సమీపంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీరంగనాథస్వామి దేవస్థానం గోశాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో పాటు పసుమర్తి చందర్‌రావు ప్రోత్సాహంతో గురువారం గోసేవా సమితి సభ్యులు సుమారు రూ.14వేలు విలువ చేసే వరిగడ్డిని వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో గో సేవా సమితి ప్రతినిధులు తూములూరి లక్ష్మీనరసింహారావు, మోతుకూరి భద్రయ్య, సూరినేటి మల్లేశం, దేవరశెట్టి రామారావు, గజ్జి సూర్యనారాయణ, జంగిలి రమణ, ఈడే శ్రీనివాస్ పెనుగొండ సాయికుమార్, దేవస్థానం అర్చకులు బూరుగడ్డ వెంకట కృష్ణమాచార్యులు, ఆచార్య సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ఘన సన్మానం

ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్‌లను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాలు, మండలకేంద్రాల్లో పదవీ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. కాగా, గ్రామాభివృద్ధికి సహకరించిన వారికి సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈనేపథ్యాన సర్పంచ్‌ల స్థానంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించగా.. వారు శుక్రవారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: అజ్మీరతండా సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



కూసుమంచి: సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, తదితరులు



రఘునాథపాలెం: రాంక్యాతండాలో పాలకవర్గానికి సన్మానం..



రఘునాథపాలెం: బూడిదంపాడులో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం